ఆదివారం 07 జులై2024

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL


https://epaper.eyyaltynews.com/



భారతీయ జన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని శనివారం నగర, రాష్ట్ర బీజేపీ కార్యాలయాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నేతలు డాక్టర్ కె.లక్ష్మణ్, చింతల రామచంద్ర రెడ్డి, డాక్టర్ ఎన్.గౌతమ్ రావు, సి. కృష్ణ గౌడ్, ఏడెల్లి అజయ్ కుమార్ తదితరులు హాజరై ఘనంగా నివాళులర్పించారు.

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , జూలై 6**






కెకే కు రాష్ట్ర ప్రభుత్వం కీలక పదవి.. ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు. 2లో



బస్సులో పురుడుపోసిన మహిళా కండక్టర్‌కు సన్మానం.. ఆ చిన్నారికి జీవితకాలపు ఉచిత బస్ పాస్ ప్రకటన 2లో



ప్రధాని మోదీ అయోధ్య నుంచి పోటీ చేస్తే.. పొలిటికల్ కెరీర్ ముగిసేది.. రాహుల్ గాంధీ కామెంట్స్ 3లో



యూకే కొత్త ప్రధాని కైర్ స్టార్‌మన్‌కి అభినందనలు తెలిపిన మోదీ.. 3లో

## ఇరు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి కమిటీలు

### రేవంత్, చంద్రబాబు భేటీలో

# కీలక నిర్ణయాలు

**రెండు గంటల పాటు సాగిన ఇద్దరు సీఎంల మీటింగ్..**



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 6 : హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. పదేళ్లుగా పరిష్కారం కాని విభజన హామీలు, ఆస్తుల పంపకానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రజా భవన్‌లో సమవేశమైన తెలుగు రాష్ట్రాల సీఎంలు రెండు గంటలపాటు చర్చలు జరిపారు. మరోసారి భేటీ కావాలని ఇద్దరు నేతలు నిర్ణయించారు. విభజన సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు వీలుగా రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులతో ఓ కమిటీని వేయాలని నిర్ణయించారు.**

ప్రధానంగా భద్రాచలం నుండి ఏపీలో కలిపిన ఏడు మండలాల్లోని 5 గ్రామాలను తమకు తిరిగి ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ విషయంలో చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. భద్రాచలం పట్టణానికి అనుకుని ఉన్న ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నం పంచాయతీలను..తిరిగి తెలంగాణలో కలపాలన్న డిమాండ్ ఎప్పటి నుండో వినిపిస్తుంది. ఈ గ్రామాల విలీనంతో భద్రాచలం పట్టణ అభివృద్ధికి అవకాశం ఉంటుందని చెబుతోంది. అయితే ఓ రాష్ట్రంలోని గ్రామాలను వేరే రాష్ట్రంలో కలపాలంటే.. కేంద్ర అనుమతి తప్పనిసరి. కేంద్ర హెూంశాఖకు లేఖ రాయాలని సమావేశంలో నిర్ణయించారు.

ప్రజాభవన్ భేటీలో విభజన సమస్యల పరిష్కారానికి రోడ్ మ్యాప్ ఖరారు చేశారు ఇరువురు ముఖ్యమంత్రులు. రాష్ట్ర ప్రయోజనాలపై రాజీపడకుండా ఉమ్మడి అజెండాపై కలిసిపని చేయాలని రెండు రాష్ట్రాలు మొదటి నుంచి భావిస్తున్నాయి. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ఉమ్మడిగా ప్రయత్నించాలని, ఎగువ రాష్ట్రాలతో నీటి వాటాలపై కలిసి పోరాడేలా ఉమ్మడి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని నిర్ణయించారు.

ఉమ్మడి ఏపీ విభజన జరిగి పదేళ్లు పూర్తైనా కూడా.. అనేక కీలకాంశాలు ఇంకా పెండింగ్‌లో ఉండిపోయాయి. అధికారుల స్థాయిలో కొన్నిసార్లు చర్చలు జరిగినా చాలా విషయాలు ఇంకా కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా ఉమ్మడిగా తొమ్మిది ఎజెండా అంశాలను ఖరారు చేశారు. ఈ ఎజెండాలో రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం షెడ్యూలు 9, 10లో పేర్కొన్న సంస్థల ఆస్తుల పంపకాలు, విభజన చట్టంలో చేర్చని సంస్థల ఆస్తుల పంపకాలు, ఏపీ ఫైనాన్షియల్ కార్పొరేషన్ అంశాలు, పెండింగ్ విద్యుత్తు బిల్లులు, విదేశీ రుణ సాయంతో నిర్మించిన ప్రాజెక్టుల ఆస్తులు-అప్పుల పంపకాలు, ఉమ్మడి సంస్థలకు చేసిన చెల్లింపులు, లేబర్ సెస్ పంపకాలు, ఉద్యోగుల విభజన అంశాలపై చర్చించారు.



**ఇద్దరు సీఎంలు కలిసిన వేళ.. చంద్రబాబుకు రేవంత్ ఇచ్చిన స్పెషల్ గిఫ్ట్ ఏందంటే..**

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 6 :** రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీపై సర్వత్ర ఉత్కంఠ నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రత్యేక భేటీకి హైదరాబాద్‌లోని ప్రజా భవన్ వేదికైంది. కాగా శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రజాభవన్‌కు చేరుకున్న చంద్రబాబుకు..తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రులో భేటీలో ఏపీ నుంచి సీఎం చంద్రబాబుతో పాటు మంత్రులు కందుల దుర్గేష్, సత్యప్రసాద్, బీసీ జనార్ధన్‌రెడ్డి పాల్గొనగా..తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఏపీ,తెలంగాణ సీఎస్‌లతో పాటు ఇతర ఉన్నతాధికారులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. అనంతరం చంద్రబాబును సన్మానించి..కాళోజీ రాసిన "నా గొడవ" పుస్తకాన్ని బహూకరించారు రేవంత్‌రెడ్డి. నిజాం కాలం నుంచి 1980ల వరకూ పాలన..ఏళ్లతరబడి సాగిన తెలంగాణ ప్రజాఉద్యమాలపై ఈ పుస్తకంలో ప్రస్తావించారు ప్రజాకవి కాళోజీ. ఇక చంద్రబాబు..రేవంత్‌రెడ్డికి తిరుమల శ్రీవారి ప్రతిమతో పాటు శ్రీవారి ప్రసాదాన్ని అందించారు.



## గ్రేటర్ కౌన్సిల్ సమావేశం లొల్లి లొల్లి

### మేయర్ రాజీనామాకు బీఆర్ఎస్ కార్పొరేటర్ల పట్టు

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , జూలై 6 :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తొమ్మిదో కౌన్సిల్ సమావేశం లొల్లిలొల్లి గా మారింది. బీఆర్ఎస్ , బీజేపీ కార్పొరేటర్లు సమావేశం ప్రారంభానికి ముందే ప్రధాన కార్యాలయం ఆవరణలో ఆందోళనకు దిగారు. అనంతరం శనివారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కాగా.. నిరసనలతో కొద్ది నిమిషాల్లోనే మీటింగ్ గందరగోళంగా మారింది. బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టారు. ఆమె పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని.. మేయర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యుల తీరుపై మేయర్ విజయలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ పార్టీ అని మేయర్ అన్నారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సమావేశం నుంచి వెళ్లిపోయారు. మీటింగ్ 15 నిమిషాలు వాయిదా వేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. వాయిదా అనంతరం సమావేశాలు తిరిగి ప్రారంభం కాగా.. నేతలు తమ పరిధిలోని సమస్యలను ఏకరవు పెట్టారు.

**మేయర్ రాజీనామాకు డిమాండ్**


బల్దియా కౌన్సిల్ సమావేశానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎక్స్ అఫీషియో సభ్యులు, బీజేపీ నేతలు హాజరయ్యారు. కాగా, మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమయ్యారు. మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు డిప్యూటీ మేయర్ శ్రీలత, మరికొంత మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో వీరి రాజీనామాకు పట్టుబట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన గ్రేటర్ ప్రజా ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కావాలని నిర్దేశించింది. పార్టీ మారిన మేయర్ రాజీనామా డిమాండ్, ఇతర సమస్యలపై బహిరంగంగా ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమయ్యారు. 150 మంది కార్పొరేటర్లలో ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లు ఎమ్మెల్యేలు. మరో ఇద్దరు ఎర్రగడ్డ, గుడిమల్కాపూర్ కార్పొరేటర్లు చనిపోయారు. ప్రస్తుతం 47 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. ఎంఐఎంకు 41 మంది, బీజేపీకి 39, కాంగ్రెస్‌కు 19 మంది సభ్యులున్నారు.




మేయర్ గద్వాల విజయలక్ష్మి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించి బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలసి నిరసన తెలుపుతున్న గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్.

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 6**

'టెట్' నిర్వహణ ఇకపై ఏడాదికి రెండుసార్లు.... ఉత్తర్వులు జారీచేసిన తెలంగాణ సర్కార్ 2లో




సికింద్రాబాద్-గోవా బైక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు.. ప్రధానికి ధన్యవాదాలు తెలిపిన కిషన్‌రెడ్డి 2లో



## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

### ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 6 :** ప్రభుత్వ, స్వచ్ఛంద రంగ సంస్థల ద్వారా అందించే వృత్తి నైపుణ్య శిక్షణలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక ప్రగతి సాధించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మహిళలకు సూచించారు. అంబర్ పేట డివిజన్ రఘునాథ్ నగర్ లో మైష టైలరింగ్ శిక్షణ కేంద్రంలో టైలరింగ్ లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుట్టుమిషన్ వంటి శిక్షణలే కాకుండా సాంకేతికంగా సైతం మహిళలు రాణించాలన్నారు. స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోడానికి ఇలాంటి శిక్షణలు ఎంతగానో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రామారావు యాదవ్, రమేశ్, రాజు, సంతోష్ చారి తదితరులు ఉన్నారు..

## మంత్రి శ్రీధర్ బాబును కలసిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

### పార్టీ మారుతారనే జోరుగా ప్రచారం..?



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , జూలై 6 :** ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. శనివారం సచివాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యేల బృందం మంత్రిని కలిశారు. గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మర్రి రాజశేఖర్ రెడ్డి, అరికపూడి గాంధీ, సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, బండారు లక్ష్మారెడ్డి తదితరులు మంత్రితో చర్చలు జరిపారు. అయితే, ఈ గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు మంత్రి శ్రీధర్‌బాబును కలవడం చర్చనీయంశంగా మారింది. మంత్రి కలవడం వెనుక ఉద్దేశం ఏమిటని పొలిటికల్ సర్కిల్లో చర్చ జరుగుతోంది. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన గ్రేటర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల సమావేశానికి ఏడుగురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. ఆ సమావేశానికి హాజరుకాని ఎమ్మెల్యేల లిస్ట్‌లో వీరు ఉన్నారు.

మంత్రి శ్రీధర్ బాబును కలవడం, మీటింగ్‌కు డుమ్మ కొట్టడంతో వీరు పార్టీ మారుతారా? అనే ప్రచారం జోరుగా టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హస్తం తీర్థం పుచ్చుకున్నారు. తాజాగా వీరు మంత్రిని కలవడం హాట్ టాపిక్ అయింది. అయితే.. తమ నియోజకవర్గాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ మంత్రితో చర్చలు జరిపినట్లు ఎమ్మెల్యేలు చెప్పుకొచ్చారు. తమ జిల్లా ఇంచార్జ్ మంత్రి కావడంతో నియోజకవర్గాలకు నిధులు కేటాయించాలని కోరినట్లు ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.

### రాష్ట్రంలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు

## ఎల్లో అలర్ట్ జారీ

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , జూలై 6 తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. నేడు, రేపు కూడా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాలో భారీ వానలు కురుస్తున్నాయి. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వనపర్తి, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, సిద్దిపేట, గద్వాల్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షం కురుస్తుంది. ఈ మేరకు ఆయా జిల్లాల అధికారులను వాతావరణ కేంద్రం అప్రమత్తం చేసింది. వర్షంతో పాటు భారీ ఈదురు గాలులు కూడా వీచే అవకాశం ఉంది. ఈరోజు రాత్రికి ( జులై 6) హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఎల్లో అలర్ట్ ప్రకటించారు. శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో హైదరాబాద్ తడిసిముద్దయింది. కొత్తపేట, మలక్ పేట, దిల్ సుఖ్ నగర్, చైతన్యపురి, వనస్థలిపురం, ఉప్పల్, నాగోల్, బేగంపేట ప్రాంతాల్లో భారీ వర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.



మిగతా..

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/



### జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో

## మంత్రులు, అధికారులతో ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూలై 6: సీఎం రేవంత్ రెడ్డితో కీలక సమావేశం ముంగిట ఏపీ సీఎం చంద్రబాబు హైదరాబాదులోని తన నివాసంలో మంత్రులు, అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రుల సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సమీక్షలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేశ్, బీసీ జనార్దన్ రెడ్డి, ఏపీ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లయినా పరిష్కారం కాని వివిధ అంశాలపై నేడు ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చర్చించనున్నారు. ఈ కీలక సమావేశం కోసం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రజాభవన్ కు చేరుకోగా, చంద్రబాబు కూడా కాసేపట్లో హాజరుకానున్నారు.

## 'టెట్' నిర్వహణ ఇకపై ఏడాదికి రెండుసార్లు

### ఉత్తర్వులు జారీచేసిన తెలంగాణ సర్కార్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , జూలై 6 :తెలంగాణలోని ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. ఇకపై ఏడాదికి రెండుసార్లు టెట్ నిర్వహించనున్నట్లు నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం.. ఏటా జూన్, డిసెంబర్ నెలల్లో టెట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇక ఒక అభ్యర్థి ఎన్నిసార్లు అయినా టెట్ పరీక్ష రాయవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే డీఎస్సీ రాసుకునేందుకు మాత్రం.. టెట్‌లో కచ్చితంగా ఉత్తీర్ణత సాధించిన వారికే అవకాశం కల్పించనున్నారు. టెట్ మార్కులను డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వనున్నారు. సీబీఎస్ఈ ఏటా రెండుసార్లు సీటెట్ పరీక్ష నిర్వహిస్తోంది. అదే తరహాలో నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్?సీటీఈ) ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాలని రాష్ట్రాలను ఆదేశించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా టెట్ గడువును జీవితకాలానికి పెంచింది కేంద్ర ప్రభుత్వం. దీంతో ఒక్కసారి క్వాలిఫై అయితే, మరోసారి రాయాల్సిన అవసరం లేదు. టెట్ మార్కులకు డీఎస్సీలో వెయిటేజీ ఉండటంతో కేవలం ఇప్పటికే టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు తమ స్కోర్ పెంచుకునేందుకు మాత్రమే రాసుకునే వెసులుబాటు కల్పించారు.

## బస్సులో పురుడుపోసిన మహిళా కండక్టర్‌కు సన్మానం

### ఆ చిన్నారికి జీవితకాలపు ఉచిత బస్ పాస్ ప్రకటన



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 6: ఆర్టీసీ బస్సులో గర్భిణికి పురుడుపోసి మానవత్వం చాటుకున్న సంస్థ సిబ్బందిని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది. హైదరాబాద్ బస్ భవన్‌లో శనివారం ఉన్నతాధికారులతో కలిసి సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ వారిని ఘనంగా సన్మానించారు.బస్సులో జన్మించిన చిన్నారికి తమ బస్సుల్లో జీవిత కాలం ఉచితంగా ప్రయాణించేలా బస్ పాస్‌ను అందిస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ బస్సులు, బస్ స్టేషన్‌లలో పుట్టిన పిల్లలకు జీవిత కాలపు ఉచిత బస్ పాస్‌ను ఇవ్వాలని గతంలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు.. ఈ ఆడబిడ్డకు బర్త్ డే గిఫ్ట్‌గా లైఫ్ టైం ఫ్రీ బస్ పాస్‌ను మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు.హైదరాబాద్‌లోని ముషీరాబాద్ డిపోకు చెందిన 1 జెడ్ రూట్ బస్సులో శుక్రవారం ఉదయం శ్వేతా రత్నం అనే గర్భిణీ ఆరాంఘర్‌లో ఎక్కారు. బహదూర్‌పూర వద్దకు రాగానే ఆమెకు పురిటి నొప్పులు తీవ్రమయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ ఆర్.సరోజ అప్రమత్తమై మహిళా ప్రయాణికుల సాయంతో సాధారణ ప్రసవం చేశారు. ఆమె పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చారు. డెలివరీ అనంతరం అనంతరం మెరుగైన వైద్యం కోసం బస్సులోనే సమీపంలోని గవర్నమెంట్ మెటర్నటీ ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. సమయస్ఫూర్తితో స్పందించి.. సకాలంలో కాన్పు చేసిన కండక్టర్ సరోజ సేవలను ఈ సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ ప్రశంసించారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తల్లీబిడ్డను బస్సులోనే మెటర్నటీ ఆస్పత్రికి తీసుకెళ్లిన డ్రైవర్‌ను కూడా అభినందించారు. కండక్టర్ చాకచక్యంగా వ్యవహరించడంతోనే తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని అన్నారు.

## సికింద్రాబాద్-గోవా బైక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు

### ప్రధానికి ధన్యవాదాలు తెలిపిన కిషన్‌రెడ్డి



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , జూలై 6 : తెలుగు రాష్ట్రాల నుంచి గోవా వెళ్లే ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. సికింద్రాబాద్ నుంచి వాస్కోడగామా(గోవా) వెళ్లేందుకు కొత్త ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించనున్నారు. ఇప్పటివ రకు వారానికి ఒక రైలు 10 బోగీలతో సికింద్రాబాద్ నుంచి బయలుదేరి గుంతకల్‌లో చేరుకుని అక్కడ తిరుపతి నుంచి గోవాకు వెళ్లే మరో 10 బోగీలతో కలిపి ఒక నూతన రైలుగా మారి గోవాకు ప్రయాణం సాగుతుంది. ఇది కాకుండా కాచిగూడ – యలహంక మధ్య వారానికి 4 రోజులు ప్రయాణం సాగించే రైలుకు గోవాకు వెళ్ళే 4 కోచ్‌లను కలిపేవారు. ఈ 4 కోచ్ లను తిరిగి గుంతకల్ వద్ద షాలిమార్ – గోవా మధ్యన తిరిగే రైలుకు కలిపి ప్రయాణం సాగించేవారు. ఇప్పుడు సికింద్రాబాద్–వాస్కోడగామా (గోవా) మధ్య బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించడంతో ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌లకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## ఏపీ సీఎం చంద్రబాబును మరోసారి హెచ్చరించిన వైఎస్ జగన్



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూలై 6: రాష్ట్రంలో చంద్రబాబు భయానక వాతావరణం సృష్టిస్తున్నారని మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. మునుపెన్నడూ రాష్ట్రంలో లేని చెడు సంప్రదాయానికి సీఎం చంద్రబాబు నాయుడు నాంది పలికారని విమర్శించారు. టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వైసీపీ కార్యకర్త అజయ్‌కుమార్ రెడ్డిని వైఎస్ జగన్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. టీడీపీ చేస్తున్న దాడులను వెంటనే ఆపేయాలని సూచించారు. దాడులు ఆపకపోతే అవే వాళ్లకు తిప్పికొడతాయని టీడీపీ గుర్తించాలని హెచ్చరించారు. వైసీపీకి ఓటేశారని 20 ఏళ్ల పిల్లాడిని దారుణంగా కొట్టారని వైఎస్ జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ నేత అజయ్‌పై దాడి చేయడం దారుణమని అన్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు జరగలేవని గుర్తుచేశారు. పులివెందుల చరిత్రలో ఇలాంటి సంప్రదాయం లేదని అన్నారు. చంద్రబాబు రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని అన్నారు. శిశుపాలుడి పాపాల మాదిరిగా ఆయన పాపాలు కూడా పండుతున్నాయని చెప్పారు. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదని గుర్తు చేశారు. అధికారం మారిన రోజున ఆ పాపాలు తనకే చుట్టుకుంటాయని చంద్రబాబు గుర్తించాలని హెచ్చరించారు. ఈ సంస్కృతిని ఆపేయాలని చంద్రబాబును మరోసారి హెచ్చరిస్తున్నా అని.. ఇది సరైన పద్ధతి కాదని చెప్పారు. వైసీపీ శ్రేణులపై దాడులు ఆపకపోతే న్యాయపోరాటం చేస్తానని తెలిపారు.చంద్రబాబు మోసపూరిత వాగ్దానాల వల్లే పది శాతం ఓట్లు కూటమికి పడ్డాయని జగన్ అన్నారు. రైతు భరోసా, నిరుద్యోగ భృతి, అక్కాచెల్లెమ్మలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఈ సందర్భంగా ప్రశ్నించారు. వైసీపీ శ్రేణులపై దాడులపై కాకుండా ఇచ్చిన హామీల మీద దృష్టి సారించాలని చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి సూచించారు. నాయకులుగా ఉన్న మనం ఎప్పుడూ ఇలాంటి దాడుల సంస్కృతిని ప్రోత్సహించే పరిస్థితి రాకూడదని చంద్రబాబుకు హితవుపలికారు.

## డిప్యూటీ సీఎం పవన్ ప్రకటన.. రియల్ భూమ్ ఏ పిఠాపురం..!




ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూలై 6: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురం నియోజకవర్గంలో ఇప్పుడు రియల్ భూమ్ నడుస్తోందట.. దానికి ప్రధాన కారణం జనసేనాని పవన్ ప్రకటనే అంటున్నారు స్థానికులు.. పిఠాపురం నుంచి బరిలోకి దిగి.. భారీ మెజార్టీతో విజయాన్ని అందుకున్నారు పవన్ కల్యాణ్.. ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసార తన సొంత నియోజకవర్గంతో పాటు.. కాకినాడ జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించారు.. దీనికి రియల్ భూమ్‌కి కారణం ఏంటి? అంటారా? విషయం ఏంటంటే.. పిఠాపురంలో ఇల్లు కట్టుకోవడానికి సిద్ధం అవుతున్నారు పవన్.. 3.52 ఎకరాల భూమి కొన్నట్లు స్వయంగా పవన్ కల్యాణే ప్రకటించారు.. రెండు ఎకరాల్లో పార్టీ కార్యాలయం, మిగతా స్థలంలో ఇల్లు కడతానని బహిరంగ వెల్లడించారు.. మరో 16 ఎకరాలు వ్యవసాయ భూమి కొనుగోలు చేసేందుకు సిద్ధమైన పవన్.. దానికి రైతులతో ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్నారని.. వచ్చే పర్యటనలో రిజిస్ట్రేషన్ కి అవకాశం ఉందని తెలుస్తోంది.

## కాంగ్రెస్‌లోకి గద్వాల బీఆరెస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి..

### నేడు మరో నలుగురు చేరే అవకాశం



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 6: తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ నుంచి వరుస వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా ఆ పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరారు. గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కృష్ణ మోహన్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు. జూబ్లీహిల్స్ సీఎం నివాసంలో కండువా కప్పి కృష్ణమోహన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. నేడు చేరాల్సి ఉండే.. జిల్లా రాజకీయ పరిస్థితులు దృష్ట్యా శనివారం చేరడం గమనార్హం. కాంగ్రెస్ లో రేపు మరో నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యే లు చేరే అవకాశం ఉన్నట్లు టాక్. కాగా శనివారం ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాలు శ్రీధర్ బాబును బీఆర్ఎస్ నేతలు కలవనున్న నేపథ్యంలో ఉత్కంఠ నెలకుంది. ఈ కార్యక్రమంలో.. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, దానం నాగేందర్ పాల్గొన్నారు. బీఆర్ఎస్‌కు షాక్ ఇచ్చి ఇప్పటికే 10 మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఐదారుగురు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రేపో మాపో కాంగ్రెస్ కండువా కూడా కప్పుకుంటారని హస్తం పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్న ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ అగ్రనేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు కూడా కాంగ్రెస్‌లో చేరడంపై విమర్శలు చేస్తున్నారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన కాంగ్రెస్‌లో చేరిన నేతలు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

## ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీ అవడం మంచి పరిణామమే: ఈటల



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 6: తెలుగు రాష్ట్రాల సీఎం ల భేటీ పై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీ అవడం మంచి పరిణామమేనని, విభజన సమస్యలు పరిష్కారం చేసుకోవాలన్నారు ఈటల రాజేందర్. ఉద్యోగుల విభజన అంశం ఇంకా కొలిక్కి రాలేదని, రెండు రాష్ట్రాల కు అవసరం అయ్యే విదంగా చర్చలు జరిగాలన్నారు ఈటల. మేము ఉద్యమ సమయంలో కూడా ఇదే విషయం చెప్పామన్నారు. అంతకు ముందు జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఎంఐఎం, బీజేపీ కార్పొరేటర్ల మధ్య చోటుచేసుకున్న ఘర్షణపై ఈటల రాజేందర్ రియాక్ట్ అయ్యారు. ప్రజా సమస్యలపై నిలదీస్తుంటే వాళ్లే అకారణంగా మా మహిళా కార్పొరేటర్లపై దౌర్జన్యం చేశారని ఆరోపించారు. శనివారం కౌన్సిల్ మీటింగ్ అనంతరం ఈటల మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయాలు, పదవులపై ఉన్న ధ్యాస ప్రజా సమస్యల పరిష్కారంపై లేదని మండిపడ్డారు. దీనికి ఇవాళ కౌన్సిల్‌లో జరిగిన ఘటనే నిదర్శనమని చెప్పారు. గత బీఆర్ఎస్ హయాంలో జరిగినట్లుగానే ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కాంగ్రెస్ తుంగలోకి తొక్కుతోందని విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీ కూడా ఇదే తరహాలో ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పనిచేసి ప్రజాగ్రహానికి గురైందని, కాంగ్రెస్ కూడా ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు ఈటల.





## మల్లారెడ్డి యూనివర్సిటీలో ఫస్ట్ కాన్వకేషన్ డే

### ముఖ్య అతిథిగా హాజరైన మల్లన్న

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , జూలై 6:** మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్?లోని మల్లారెడ్డి యూనివర్సిటీలో ఫస్ట్ కాన్వకేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ ఫౌండర్ (ఛైర్మన్) మల్లారెడ్డి, రిజిస్టార్ అంజనేయులు, వైస్ ఛైన్సలర్ వివిఎస్.కె రెడ్డితో పాటు యూనివర్సిటీ ప్రెసిడెంట్ భద్రారెడ్డి, డైరెక్టర్లు శాలిని రెడ్డి, ప్రీతిరెడ్డి, ప్రవీణ్ రెడ్డిలు పాల్గొని జ్యోతి ప్రజ్వాళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఇంజనీరింగ్, మేనేజ్మెంట్, డిజిటల్ పాలిటిక్స్ లలో కలిపి మల్లారెడ్డి యూనివర్సిటీ నుండి మొదటి బ్యాచ్ బయటకి వెళ్లడం, ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులందికి లక్షల ప్యాకెజ్ తో జాబ్స్ సాధించడంతో తన జీవితమే ధన్యమైందన్నారు. ఒకప్పుడు ఇంజనీరింగ్ యూనివర్సిటీ అంటే ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్టీయూహెచ్ లు మాత్రమే ఉండేవని.. ఇప్పుడు ప్రైవేట్ పరంగా మల్లారెడ్డి యూనివర్సిటీ కుడా ఉందని అన్నారు. రానున్న రోజుల్లో మల్లారెడ్డి యూనివర్సిటీకి ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉండే రోజులు తీసుకొస్తామని మల్లారెడ్డి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## కేకేకు రాష్ట్ర ప్రభుత్వం కీలక పదవి..

### ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు..



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

ADVISOR – Appointment of Dr. K. Keshava Rao, as Advisor to Government (Public Affairs) in the status of Cabinet Minister – Orders – Issued.

GENERAL ADMINISTRATION (SPECIAL.A) DEPARTMENT

G.O.Rt.No.930 Dated:06.07.2024

***

ORDER:-

Government hereby appoint Dr. K. Keshava Rao, as Advisor to Government (Public Affairs) in the status of a Cabinet Minister from the date of assumption of charge.

The terms and conditions of his appointment will be issued separately.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

SANTHI KUMARI
CHIEF SECRETARY TO GOVERNMENT

To
Dr. K. Keshava Rao.
The Pay & Accounts Officer, Telangana, Hyderabad.
Copy to:
The Deputy Pay & Accounts Officer, Secretariat, Hyderabad.
All Departments of Secretariat.
The Accountant General (A&E), Telangana, Hyderabad.
The PS to Prl. Secy. / Secys / Spl. Secy. / Jt. Secy/ OSD to CM
The PS to All Hon'ble Ministers
The PS to CS / PS to Secretary, GAD
The PS to Joint Secretary (Protocol), GAD & Director, Protocol
The GA (Claims / OP.I / OP.II, OP.III & OP.IV / SB / Accommodation )
[illegible] Dept. for necessary action.

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 6: ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన కె.కేశవరావుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక పదవిని కట్టబెట్టింది. ఆయనను కాంగ్రెస్ ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా వ్యవహారాల సలహాదారుగా కేశవరావు కొనసాగుతారు. కేశవరావుకు కాంగ్రెస్ ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేకే గురువారం తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధంకడ్‌తో కలిసి ఆయన తన రాజీనామా లేఖను సమర్పించారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే సమక్షంలో కేకే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కేకే పదవీకాలం ఇంకా రెండేళ్లు ఉంది. దీంతో పీసీసీ చీఫ్ పదవిపై ఆశలు పెట్టుకున్న నేతలు, ఎంపీ ఎన్నికల్లో టిక్కెట్ రాని సీనియర్ నేతలు ఆ సీటుపైనే ఆశలు పెట్టుకున్నారు. అయినా వారి ఆశలు నెరవేరేలా కనిపించడం లేదు. సుప్రీం కోర్టు ప్రముఖ న్యాయవాది, ఏఐసీసీ అధికార ప్రతినిధి అభిషేక్ మనుసింఘ్వీకి సీటు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

## ముస్లింలకు బీజేపీ వ్యతిరేకం కాదు.. మతపరమైన రిజర్వేషన్లకు మాత్రమే:లక్ష్మణ్

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 6: ముస్లింలకు బీజేపీ వ్యతిరేకం కాదని.. మతపరమైన రిజర్వేషన్లకు మాత్రమేనని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి లక్ష్మణ్, బీజేపీ నేతలు నివాళులు అర్పించారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు విభజన సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. విభజన అంశాల విషయం లో ప్రాంతీయ ను రెచ్చగొట్టి రాజకీయంగా ఉపయోగించుకోవద్దని తెలిపారు. కేంద్రం, మోడీ రెండు రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని తెలిపారు. తిరుపతి పవిత్రతను కాపాడాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి బహిరంగ లేఖ రాస్తున్నా అన్నారు. భారత దేశ సమగ్రత కోసం తన ప్రాణాలు సైతం అర్పించారు శ్యామా ప్రసాద్ ముఖర్జీ అన్నారు. భావితరాలకు, నేటి తరాలకు స్ఫూర్తిని కలిగించేలా శ్యామా ప్రసాద్ ముఖర్జీ పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పశ్చిమ బెంగాల్ ను తూర్పు పాకిస్తాన్ లో కలుపుతారనే కుట్రల నేపథ్యంలో ఎదురొడ్డి నిలబడ్డారని తెలిపారు.

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

# అమర్‌నాథ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 6: అమర్‌నాథ్ యాత్ర ఇటీవలే ప్రారంభమైన విషయం తెలిసిందే. జమ్మూకశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలోని ఎత్తయిన గుహలో సహజసిద్ధంగా ఏర్పడే మంచు శివలింగాన్ని దర్శించుకునేందుకు భక్తులు తరలివెళ్తున్నారు. అయితే, తాజాగా ఈ యాత్రకు తాత్కాలికంగా బ్రేక్ పడింది . ప్రస్తుతం అక్కడ భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు శనివారం ప్రకటించారు. బాల్తాల్ పహల్గాం మార్గాల్లో శుక్రవారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తుండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా యాత్రికుల భద్రత నిమిత్తం ముందు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రెండు మార్గాల్లోనూ యాత్రను నిలిపివేసినట్టు స్పష్టం చేశారు. ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర జూన్ 29న ప్రారంభమైన విషయం తెలిసిందే. 3,800 మీటర్ల ఎత్తులో సహజసిద్ధంగా ఏర్పడిన మంచు లింగాన్ని దర్శించుకునేందుకు ఏటా లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు.





## వైరల్ అవుతున్న చీమల చట్నీ.. తిన్నారంటే అన్ని రోగాలు పోతాయంట?



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 6: చీమను చూసి క్రమశిక్షణ నేర్చు కొమ్మని పెద్దలు చెబుతూ ఉంటారు. చీమలు క్రమ శిక్షణకు పెట్టింది పేరు. ఏ కాలంలో ఎలా బ్రతకాలో వాటికి బాగా తెలుసు. అయితే ఎంత క్రమ శిక్షణగా ఉన్న చీమ అయినా.. మనకు కనిపిస్తే బ్రతుకుతాయా.. ఏ చీమల మందు కానీ.. స్ప్రే కానీ చేసి చంపేస్తాం. ఇప్పుడు చీమల టాపిక్ ఎందుకా అంటారా.. మనం మాట్లాడుకునేదే చీమల చట్నీ గురించి కదా. చీమల చట్నీ గురించి ఇది వరకే వినే ఉంటారు. కానీ చీమల చట్నీ ఎలా చేయాలో చేయడం ఎలాగో ఎప్పుడైనా వీడియో చూశారా. మీ కోసమే ఆ వీడియో తీసుకొచ్చాం. సోషల్ మీడియాలో ఈ వీడియో తెగ వైరల్ అవుతుంది. ఇప్పటి వరకూ ఈ వీడియోను 25 మిలియన్ల మంది చూశారు. లక్షల్లో లైకులు, షేర్లు, కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు. ఈ వీడియోను ఏ%టశీశీసస్త్రబఎతీఅంస్త్రఱ% ఇన్ స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. షేర్ చేసిన కొద్ది రోజుల్లోనే ఈ వీడియో ట్రెండింగగా మారింది. ఎర్రల చీమల చట్నీలు ఎలా తయారు చేస్తారో.. వీడియోలో ఉంటే.. వ్లాగర్ వాయిస్ ఓవర్ ఇస్తుంది. ఇప్పుడు ఈ వీడియో ఎంతో మందిని ఆకట్టుకుంది. ఇంతకీ ఇప్పుడు ఎర్ర చీమల చట్నీ ఎలా తయారు చేస్తారో ఇప్పుడు తెలుసుకుందాం. ఈ వీడియోలో ఒక మహిళ ఒక కర్ర.. బకెట్ పట్టుకుని మామిడి చెట్టు దగ్గరకు వెళ్లింది. అక్కడ ఒక చెట్టు భాగంలో చీమలు బాగా పట్టి ఉంటాయి. దాన్ని తెంపి వాటర్ ఉన్న ఒక బకెట్‌లోకి వేస్తుంది. వెంటనే ఆ చీమల్ని కడిగి.. ఒక వస్త్రంపై ఆర పెడుతుంది. ఆ తర్వాత పచ్చడి చేసే రోటిలో ఎండు మిర్చి, పచ్చి ఉల్లిపాయ, వెల్లుల్లి, ఉప్పు వేసి బాగా నూరుతుంది. ఇది బాగా పేస్టులా అయ్యాక అందులో ఆరబెట్టిన చీమల్ని కూడా వేసి బాగా రుబ్బుతుంది. అంతే ఎంతో రుచిగా ఉండే ఎర్ర చీమల చట్నీ సిద్ధం. ఈ చట్నీని అక్కడ ఉన్న చిన్నా, పెద్దా అందరూ తినేస్తున్నారు. ఇలా ఎర్ర చీమల చట్నీ తినడం వల్ల అనారోగ్య సమస్యలు రావని వాళ్లు నమ్ముతున్నారు.

## యూకే కొత్త ప్రధాని కైర్ స్టార్‌మన్‌కి మోదీ అభినందనలు



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 6: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) సార్వత్రిక ఎన్నికల్లో లేబర్ పార్టీ, అధికార రిషి సునాక్ నేతృత్వంలోని కన్జర్వేటివ్ పార్టీని చిత్తుగా ఓడించింది. యూకే ప్రజలు లేబర్ పార్టీకి గణనీయమైన అధికారాన్ని కట్టబెట్టారు. కొత్త ప్రధానిగా కైర్ స్టార్‌మన్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఇదిలా ఉంటే ప్రధాని నరేంద్రమోదీ, యూకేకి కాబోతున్న పీఎం కైర్ స్టార్‌మన్‌తో శనివారం మాట్లాడారు. విజయం పట్ల ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఇరు దేశాలకు లాభదాయకమైన భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని త్వరగా కుదుర్చుకునేందుకు కృషి చేయాలని ఇరువురు నేతలు అంగీకరించారు.

ఇరువురు నేతలు భారత్, బ్రిటన్ మధ్య ఉన్న చారిత్రాత్మక సంబంధాలను గుర్తు చేసుకున్నారని, దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్చించారని ప్రధానమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలియజేసింది. యూకే సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధిలో భారతీయ కమ్యూనిటీ సహకారాన్ని అభినందిస్తూనే, సన్నిహిత సంబంధాలను ప్రోత్సహించాలని ఇరువురు అంగీకరించారు. మోడీ, స్టార్‌మన్‌ని భారత్‌లో పర్యటించాలని ఆహ్వానించారని ప్రకటన తెలిపింది.

## కేజ్రీవాల్ బెయిల్ నిలిపివేతపై న్యాయవాదులు ఆందోళన



ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ , జూలై 6: మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు మంజూరు చేసిన బెయిల్ ఆర్డర్‌ను ఢిల్లీ హైకోర్టు నిలిపివేయడంపై 150 మంది న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టులు ఆచరిస్తున్న అసాధారణ పద్ధతులపై జోక్యం చేసుకోవాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్‌కు లేఖ రాశారు. కేజ్రీవాల్‌కు రూస్ అవెన్యూ కోర్టు మంజూరు చేసిన బెయిల్ ఆర్డర్ ఉత్తర్వులు అప్‌లోడ్ కాకముందే ఢిల్లీ హైకోర్టులో ఈడీ ఎలా సవాల్ చేసింది?, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్ కుమార్ జైన్ ఎలా విచారణ చేపట్టి ఆర్డర్‌ను హోల్డ్‌లో ఉంచారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. భారత న్యాయవ్యవస్థ చరిత్రలో ఇలాంటివి ఎప్పుడూ చూడలేదని, న్యాయవాదుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించిందని 9 పేజీల లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, బెయిల్ మంజూరులో జాప్యం గురించి కూడా న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. 'ముఖ్యంగా ఈడీ, సీబీఐకు సంబంధించిన కేసుల్లో న్యాయమూర్తులు ఎక్కువ వ్యవధిలో విచారణ తేదీలు ఇస్తారు. బెయిల్ విషయాలను త్వరగా పరిష్కరించరు. న్యాయ సూత్రాలకు, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ హామీకి ఇది విరుద్ధం' అని సీజేఐకు రాసిన లేఖలో ప్రస్తావించారు.

## ప్రధాని మోదీ అయోధ్య నుంచి పోటీ చేస్తే.. పొలిటికల్ కెరీర్ ముగిసేది..రాహుల్ గాంధీ కామెంట్స్



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 6: కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్రమోదీ టార్గెట్‌గా మరోసారి విమర్శలు గుప్పించారు. ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌తో ఈ రోజు ఆయన కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలతో సమావేశమయ్యారు. ప్రధాని లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్య నుంచి పోటీ చేయాలనుకున్నారని, అయితే బీజేపీ సర్వే చేసి పరిస్థితి బాగా లేదని చెప్పడంతో ఆయన పోటీ చేయలేదని శనివారం అన్నారు. అహ్మదాబాద్‌లో పార్టీ నేతల్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. "అయోధ్యలో మేము ఓడించాము, బీజేపీ కంచుకోటలో ఆ పార్టీని కాంగ్రెస్ ఓడిస్తుంది" అని అన్నారు. అయోధ్య నుంచి ప్రధాని మోడీ పోటీ చేసుంటే ఆయన పొలిటికల్ కెరీర్ ముగిసేదని చెప్పారు. ప్రధాని మోడీకి దేవుడితో ప్రత్యక్ష సంబంధం ఉందని చెప్పారని, అలాంటప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్యలో బీజేపీ ఎందుకు ఓడిపోయిందని రాహుల్ ప్రశ్నించారు. రామ మందిర నిర్మాణం జరిగిన కొన్ని నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్య ఉన్న ఫైజాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ ఓడిపోయింది. సమాజ్ వాదీ పార్టీకి చెందిన అవధేష్ ప్రసాద్ చేతిలో బీజేపీ నేతని ఓడించారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం, ఎయిర్‌పోర్టు, ఇతర అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలకు సంబంధించి ప్రజలకు నష్టపరిహారం అందకపోవడంతోనే బీజేపీకి వ్యతిరేకంగా ఓట్లు వచ్చాయని తేలింది.

## దారుణం.. బాలుడిని నేలకేసి కొట్టి చంపిన సవతి తండ్రి




ఇయ్యాల్టి న్యూస్, క్రైం, జూలై 6: ఏపీ చిత్తూరు జిల్లాలో దారుణ ఘటన ఒకటి చోటు చేసుకుంది. అమాయక బాలుడిని ఓ మృగాడు పొట్టన పెట్టుకున్నాడు. తాగిన మైకంలో ఏమీ ఏర్పడక కడతేర్చారు. బాలుడిని దారుణంగా నేలకేసి కొట్టి చంపాడు సవతి తండ్రి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. చిత్తూరు రూరల్ దిగువ మాసపల్లికు చెందిన శిరీష అనే వివాహితకు ఒక కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. అయితే.. గత కొన్నేళ్లుగా ఆమె తన భర్తతో విభేదాలతో దూరంగా ఉంటుంది. ఈ క్రమంలో.. ప్రదీప్ అనే వ్యక్తితో శిరీష సహజీవనం సాగిస్తుంది. అయితే.. ఇంటికి తాగొచ్చిన ప్రదీప్ ఆ మైకంలో శిరీష ఏడాదిన్నర కొడుకు దినేష్ ను నేలకేసి కొట్టి చంపాడు. కాగా.. ఈ ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## రిషి సునాక్ ఫేర్‌వెల్ స్పీచ్.. అక్షతా మూర్తి డ్రెస్‌పై సోషల్ మీడియాలో ట్రోల్స్



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 6: బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో భారత సంతతికి చెందిన రిషి సునాక్ సారథ్యంలోని అధికార కన్జర్వేటివ్ పార్టీ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో విపక్ష లేబర్ పార్టీ ఘన విజయం సాధించింది. 650 మంది సభ్యులు ఉండే హౌస్ ఆఫ్ కామన్స్‌లో లేబర్ పార్టీ 412 స్థానాలను కైవసం చేసుకుంది. కన్జర్వేటివ్ పార్టీ కేవలం 121 స్థానాలకు మాత్రమే పరిమితమైంది. ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో రిషి సునాక్ ప్రధాని అధికారిక నివాసం 10 డౌనింగ్ స్ట్రీట్ వద్ద చివరి ప్రసంగం చేశారు. ఈ ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహిస్తున్నట్లు చెప్పారు. ఆ సమయంలో రిషి సునాక్ వెనకే నిల్చొని ఉన్న ఆయన భార్య అక్షతా మూర్తి ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా సునాక్ ఫేర్‌వెల్ ప్రసంగం సమయంలో అక్షత ధరించిన డ్రెస్ ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీసింది. యూకే జెండాను పోలిన ఎరుపు, తెలుపు, నీలం రంగు చెవ్రాన్ గౌనును అక్షత ధరించింది. దీన్ని ఒమి నానా అనే డిజైనర్ రూపొందించారు. దీని ధర 395 పౌండ్లుగా తెలుస్తోంది. అంటే మన భారత కరెన్సీలో రూ. 42 వేలకుపై మాటే. ఈ డ్రెస్ గురించి నెటిజన్లు రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. కొందరు ఈ డ్రెస్ బాగుంది, సందర్భానికి అనుగుణంగా అక్షత డ్రెస్ ధరించారని, ఈ డ్రెస్‌లో అక్షత చాలా స్టైలిష్‌గా ఉంది అంటూ చెప్పుకుంటున్నారు. అదే సమయంలో కొందరు దారుణంగా ట్రోల్స్ చేస్తున్నారు 'సునాక్ ప్రసంగం నుంచి దృష్టి మరల్చడానికే ఈ ప్రయత్నం' అంటూ మాట్లాడుకుంటున్నారు.

## ఎక్కడికి వెళ్లినా వదలని పాము... నెల రోజుల్లో 5 సార్లు కాటేసింది

## చికిత్స తర్వాత ప్రతిసారీ కోలుకున్న యువకుడు



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 6: యూపీలోని ఫతేపూర్ జిల్లాలో ఓ యువకుడిని నెల రోజుల్లోనే ఐదుసార్లు పాము కాటు వేసిన వింత ఉదంతం వెలుగులోకి వచ్చింది. కానీ చికిత్స తర్వాత ప్రతిసారీ యువకుడు కోలుకున్నాడు. పాము కాటుకు గురైన యువకుడు మళ్లీ మళ్లీ ఎలా కోలుకుంటున్నాడోనని చికిత్స అందిస్తున్న వైద్యులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పాము భయంతో ఆ యువకుడు తన ఇంటిని వదిలి అత్త వద్ద నివాసం ప్రారంభించడం గమనార్హం. కానీ ఆ పాము అతన్ని అక్కడ కూడా వదలలేదు. అత్త ఇంట్లో కూడా పాము అతడిని కాటు వేసింది. ఈ ఘటన అనంతరం యువకుడితోపాటు అతని కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అతడి భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారు. ఉత్తర్ ప్రదేశ్ లోని ఫతేపూర్ జిల్లా మాల్వా పోలీస్ స్టేషన్ పరిధిలోని సౌరా గ్రామంలో వికాస్ దూబే (24) నివసిస్తున్నాడు. నెలన్నర వ్యవధిలో ఐదుసార్లు పాము కాటుకు గురైనప్పటికీ, చికిత్స తర్వాత అతను కోలుకున్నాడు. ఇప్పటికీ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎందుకంటే, ఇటీవల ఓ పాము అతన్ని కాటేసిందట. జూన్ 2వ తేదీ రాత్రి 9 గంటలకు మంచం దిగుతుండగా తొలిసారి పాము కాటుకు గురయ్యాడు. ఆ తర్వాత కుటుంబసభ్యులు అతడిని ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌కు తీసుకెళ్లారు. రెండు రోజులు అక్కడే అడ్మిట్ అయ్యాడు. చికిత్స అనంతరం కోలుకుని ఇంటికి వచ్చారు. ఇది సాధారణ సంఘటన అని కుటుంబ సభ్యులు భావించారు. అయితే జూన్ 10వ తేదీ రాత్రి మళ్లీ పాము కాటేసింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈసారి కూడా చికిత్స అనంతరం కోలుకోవడం విశేషం. అయితే పాము చూసి భయపడి జాగ్రత్తలు తీసుకోవడం మొదలుపెట్టాడు. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుతాయోమోనని కుటుంబ సభ్యులు భయాందోళనకు గురవుతున్నారు. పాము మళ్లీ వికాస్‌ను కాటేస్తుందని వారు భావిస్తున్నారు.

# పోలీసులకు చిక్కిన రిచ్ దొంగ...

## ముంబైలో ఫ్లాట్, ఆడి కారు.. షాక్‌లో పోలీసులు!




ఇయ్యాల్టి న్యూస్, క్రైం, జూలై 6: ఈ దొంగ మామూలోడు కాదండోయ్.. గుజరాత్ పోలీసులు ఇటీవల అనేక రాష్ట్రాల్లో దోపిడీలకు పాల్పడిన ఓ దొంగను ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. గత నెలలో రోహిత్ కానుభాయ్ సోలంకి వాపిలో లక్ష రూపాయల చోరీ కేసులో పోలీసుల వలకు చిక్కాడు. అనంతరం విచారణలో ఆ కిలాడీ చెప్పిన విషయాలను విని పోలీసులు ఆశ్చర్యపోయారు. అయితే, 19 దొంగతనాలను అంగీకరించిన సోలంకి.. విలాసవంతమైన తన జీవనశైలిని దర్యాప్తులో వెల్లడించడంతో పోలీసులు షాక్‌కు గురికావాల్సి వచ్చింది. రోహిత్ కానుభాయ్ సోలంకి ముంబైలోని ముంబ్రా ప్రాంతంలో కోటి రూపాయలకు పైగా విలువైన ఫ్లాట్‌లో నివసిస్తూ ఆడి కారు నడుపుతున్నట్లు పోలీసులు తమ విచారణలో తెలుసుకున్నారు. విచారణలో సోలంకి 19 దోపిడీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. వీటిలో వల్సాద్‌లో మూడు, సూరత్‌లో ఒకటి, పోర్‌బందర్‌లో ఒకటి, సెల్వాల్‌లో ఒకటి, తెలంగాణలో రెండు, ఆంధ్రప్రదేశ్‌లో రెండు, మధ్యప్రదేశ్‌లో రెండు, మహారాష్ట్రలో ఒకటి ఉన్నాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో మరో ఆరు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. అతనికి అనేక రాష్ట్రాల్లో నేరాల చరిత్ర ఉంది. ముస్లిం మహిళను పెళ్లి చేసుకునేందుకు సోలంకి తన పేరును అర్హాన్‌గా మార్చుకున్నట్లు కూడా పోలీసులకు తెలిసింది. వల్సాద్ జిల్లా పోలీసులు కూడా సోలంకి నేరచరిత్ర గురించి విచారించారు. సోలంకి దొంగతనాలకు పాల్పడేందుకు విలాసవంతమైన హోటళ్లలో బస చేసి, ఫ్లైట్‌లో ప్రయాణించి, పగటిపూట హోటల్ ఉండి క్యాబ్‌లను బుక్ చేసుకునేవాడు. దొంగతనాలకు పథకం వేసేందుకు పగటిపూట సొసైటీల్లో నిఘా పెట్టేవాడు. నిందితుడు ముంబైలోని డ్యాన్స్ బార్‌లు, నైట్‌క్లబ్‌లలో పార్టీలు చేసుకుంటూ జల్సా చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. నెలకు రూ. 1.50 లక్షలు ఖర్చు చేస్తున్న రోహిత్ కానుభాయ్ సోలంకి డ్రగ్స్‌కు కూడా అలవాటు పడ్డాడని పోలీసులు వెల్లడించాడు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/

## రాజమౌళిపై డాక్యుమెంటరీ.. స్ట్రీమింగ్ ఎక్కడ, ఎప్పుడంటే..!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 6:టాలీవుడ్ లెజెండరీ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి జీవితంపై ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ తీసింది. 'మోడరన్ మాస్టర్స్: ఎస్ఎస్ రాజమౌళి' పేరుతో ఈ డాక్యుమెంటరీ రూపొందగా .. దీన్ని ఆగష్టు 02 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించింది."ఒక మనిషి. అనేక బ్లాక్ బస్టర్లు. అంతులేని ఆశయం. ఈ లెజెండరీ ఫిల్మ్ మేకర్ ఇలా అత్యున్నత శిఖరాలకు చేరుకోవడానికి అనుసరించింది ఏమిటి? మోడరన్ మాస్టర్స్: ఎస్ఎస్ రాజమౌళి, ఆగస్ట్ 2న వస్తున్నారు, నెట్‌ఫ్లిక్స్‌లో మాత్రమే!" అంటూ ట్వీట్ చేసింది. దీంతో జక్కన్న ఫ్యాన్స్‌తో పాటు సినీ అభిమానులు కూడా ఈ డాక్యుమెంటరీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఇక దర్శకుడు రాజమౌళి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తెలుగు సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన లెజెండరీ డైరెక్టర్. తనదైన మేకింగ్‌తో సినిమాలను గ్రాండ్‌గా తీయడంలో ఆయనకు ఆయనే సాటి. జక్కన్న తీసిన 'బాహుబలి', 'బాహుబలి-2', 'ఆర్ఆర్ఆర్' చిత్రాలు భారీ వసూళ్లతో పాటు తెలుగు సినిమాను ప్రపంచ వేదికపై నిలబెట్టాయి. ఇక 'ఆర్ఆర్ఆర్' అయితే ఆస్కార్ సాధించిన తొలి తెలుగు చిత్రంగా రికార్డుకెక్కింది.

చూసి ముర్వాలే






# 'హనుమాన్'గా రామ్ చరణ్..?

## జై హనుమాన్ అప్డేట్.. హనుమాన్ నిర్మాత ఏం చెప్పారంటే..?



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 6: ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఈ సంవత్సరం సంక్రాంతి బరిలో వచ్చిన హనుమాన్ సినిమా ఏ రేంజ్ లో భారీ విజయం సాధించిందో అందరికి తెలిసిందే. తేజ సజ్జ ముఖ్య పాత్రలో చిన్న సినిమాగా రిలీజయి ఏకంగా 350 కోట్ల కలెక్షన్స్ వసూలు చేసి అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఒక మనిషికి ఆంజనేయస్వామి పవర్స్ వస్తే ఎలా ఉంటుంది? ఆంజనేయస్వామి తిరిగొస్తే ఎలా ఉంటుంది అని ఆసక్తికరమైన కథతో తెరకెక్కించారు.అయితే ఈ సినిమా క్లైమాక్స్ లో హనుమంతుడు వస్తాడు. అలాగే జై హనుమాన్ అని సీక్వెల్ కూడా అనౌన్స్ చేసారు. జై హనుమాన్ సినిమాలో హనుమంతుడి పాత్ర ఉంటుందని కూడా చెప్పారు. దీంతో హనుమంతుడి పాత్ర ఏ హీరో చేస్తారు అని అంతా చర్చించుకున్నారు. హనుమాన్ సినిమా క్లైమాక్స్ లో హనుమంతుడి కళ్ళు చూసి రానా లేదా చిరంజీవి హనుమాన్ పాత్ర చేసి ఉంటారని అనుకున్నారు.అయితే తాజాగా హనుమాన్ నిర్మాత చైతన్య డార్లింగ్ సినిమా ప్రమోషన్స్ లో మాట్లాడుతూ.. హనుమాన్ పాత్రకి ఇంకా ఎవర్ని అనుకోలేదు. మేమైతే రామ్ చరణ్ కానీ, చిరంజీవి గారు కానీ చేస్తే బాగుంటుందని అనుకుంటున్నాము. వాళ్ళని అప్రోచ్ అవుతాము. కానీ ఆ టైంకి హనుమంతుడి పాత్ర ఎవరు చేస్తారు అనేది ఆ దేవుడే నిర్ణయిస్తారు. ప్రస్తుతానికి జై హనుమాన్ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుంది. సినిమా రావడానికి టైం పడుతుంది అని తెలిపారు. దీంతో ఈ వ్యాఖ్యలు వైరల్ గా మారగా మెగా అభిమానులు ఇది నిజమయి చరణ్ కానీ చిరంజీవి కానీ హనుమంతుడి పాత్ర చేస్తే బాగుంటుంది అని అనుకుంటున్నారు. మరి జై హనుమాన్ సినిమాలో హనుమంతుడి పాత్ర ఎవరు చేస్తారో చూడాలి.

## సిగ్గుపడుతూ అనసూయ.. రెడ్ శారీలో రంగమ్మత్త ఆదుర్స్ !



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 6: స్టార్ మాలో టెలికాస్ట్ అవుతోన్న కొత్త గేమ్ షోలో 'కిరాక్ బాయ్స్ ఖిలాడీ గాళ్స్' కోసం అనసూయ ఎర్రచీర కట్టింది.ఆ ఫొటోస్ సోషల్ మీడియాలో షేర్ చేసింది..చూస్తే మీరు అయిపోతారంతే...

## అందాలతో మెరిపిస్తూ ...టాలీవుడ్ ట్రెండింగ్ బ్యూటీ మాల్వి



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 6:హీరోయిన్ మాల్వి మల్హోత్రా ఇలా క్యాజివల్ డ్రెస్సుల్లో తన అందాలతో మెరిపిస్తుంది.

## బిగ్‌బాస్ షోలోకి ఎక్కువ సార్లు వెళ్లిన భామ.. ట్రెండింగ్ గా బ్యూటీ హాట్ ఫోటో?



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 6: యషిక ఆనంద్ అంటే తెలుగు, తమిళ రంగాల్లో తెలియని వారుండరేమో.. విజయ్ దేవరకొండతో నోటా ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. బిగ్‌బాస్ తమిళంలోకి అత్యధిక సార్ల వెళ్లిన సెలబ్రిటీగా అరుదైన రికార్డు ఆమె పేరుపై ఉంది. ట్రెండింగ్‌గా మారిన ఆమె లేటేస్ట్ ఫోటోషూట్ మీరు చూశారా?

## అట్టహాసంగా అంబానీ ఇంట్ల సంగీత్ వేడుక..చీరలో తళుక్కుమన్న కాజల్



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 6: ప్రముఖ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ చిన్నకొడుకు అనంత్ అంబానీ సంగీత్ వేడుక అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకల్లో పలువురు సినీ స్టార్స్ సందడి చేశారు. టాలీవుడ్ చందమామ కాజల్ శారీలో కనిపించి కనువిందు చేసింది.

## హమ్మయ్యా.. మంచు లక్ష్మి కష్టం తీరిపోయిందంట..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 6: సీనియర్ నటుడు మోహన్ బాబు వారసురాలిగా టాలీవుడ్‌లో అడుగుపెట్టింది మంచు లక్ష్మి. తన నటనతో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. నటిగా, టీవీ షో హెూస్ట్‌గా, నిర్మాతగా విజయాలను అందుకుంది. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తనకు సంబంధించిన విషయాలను అభిమాలతో పంచుకుంటూ ఉంటుంది. ఇటీవల ఆమె తనకు సాయం చేయాలని నెటిజన్లను అభ్యర్థిచగా.. ఇప్పుడు సమస్య పరిష్కారమైంది అంటూ తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. 'అమెరికా సిటిజన్ అయిన నా కుమార్తె స్కూల్ హాలీడేస్ త్వరలోనే ముగియనున్నాయి. ఈ నెల 12న మేం అక్కడకు వెళ్లాల్సి ఉంది. ఎంబసీ వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. వారిని సంప్రదించేందుకు మార్గం లేకుండా పోయింది. వీసా జారీ అయి నెలకుపైనే అయినా దాన్ని చేరవేయడంలో జాప్యం చోటుచేసుకుంది. ఎవరైనా హెల్ప్ చేయగలరా?.' అని రెండు రోజుల క్రితం మంచు లక్ష్మి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీనిపై నెటిజన్లు స్పందించారు. తమకు తెలిసిన సమాచారాన్ని చెప్పారు.తాజాగా పాస్‌పోర్టు వచ్చినట్లు మంచి లక్ష్మి తెలియజేసింది. 'ఆఖరి పాస్ పోర్టు వచ్చేసింది. సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ ఒత్తిడితో కూడిన సమయంలో ప్రేమ, మద్దతు వెలకట్టలేనిది. మీ ప్రేమకి కృతజ్ఞతలు.' అంటూ మంచు లక్ష్మి అంది.



Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838